## యూఎస్ వీసా ఇంటర్వ్యూకు 14 నెలలు?

- స్టూడెంట్, బీ1, బీ2 దరఖాస్తుదారులకు ఇబ్బందులు
- హైదరాబాద్‌లో ఇంటర్వ్యూకు 7 నెలల దీర్ఘ సమయం
- యూకే వీసా విధానం అమలు చేసే యోచనలో అమెరికా
- వెయ్యి డాలర్ల ఫీజుతో త్వరితంగా ఇంటర్వ్యూ పూర్తికి ప్రణాళిక



హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): అమెరికాకు సంబంధించి స్టూడెంట్, బీ1(బిజినెస్), బీ2(టూరిస్ట్) వీసా పొందాలనుకునే భారతీయులకు ఇబ్బందులు తప్పడం లేదు. దేశంలో ఆయా ప్రధాన నగరాల్లో ఉన్న యూఎస్ కాన్సులేట్‌లలో వీసా ఇంటర్వ్యూకు ఏడాదికి పైగా వేచి ఉండాల్సి వస్తున్నది. చెన్నైలో వీసా ఇంటర్వ్యూకు గరిష్ఠంగా 14 నెలలు, కోల్‌కతాలో కనిష్ఠంగా 6 నెలల వరకు సమయం పడుతున్నది. హైదరాబాద్‌లో 7, న్యూఢిల్లీలో 8, ముంబైలో 9.5 నెలల సమయం పడుతున్నది. తాజాగా ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ బీ1, బీ2, స్టూడెంట్ వీసా ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు యూకే తరహా విధానాన్ని అమలు చేయనున్నది. ఇందుకోసం ఇప్పటికే ఓ పరిపాలన మెమో జారీ చేసింది. నాన్ ఇమిగ్రెంట్ వీసాల ప్రాసెస్ త్వరగా పూర్తి కావడానికి వెయ్యి డాలర్లు ఫీజు చెల్లించాలని పేర్కొంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఈ పైలెట్ ప్రాజెక్టును అమలు చేసేలా యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ విధానంతో త్వరగా వీసా స్లాట్ పొందే వీలుంటుందని వీసా కన్సల్టెంట్లు చెబుతున్నారు.

**యూకేలో మూడు రకాలుగా..**

యూకే తమ దేశానికి వచ్చే విదేశీయుల కోసం ప్రియారిటీ(ప్రాధాన్యత) ఆధారంగా డబ్బులు చెల్లించి వీసాలను తొందరగా పొందే వీలు కల్పించింది. స్టాండర్డ్ వీసాను సుమారు రూ.62,951 చెల్లిస్తే 15 రోజుల్లో పొందే వీలు కల్పించింది. ప్రియారిటీ వీసాను సుమారు రూ.1,22,235 చెల్లించి 5 రోజుల్లో పొందొచ్చు. సూపర్ ప్రియారిటీ వీసాకు రూ.1,75,951 చెల్లిస్తే 1-2 రోజుల్లో వీసా పొందవచ్చు. ఇలాంటి విధానాన్నే అమెరికాలో అందుబాటులోకి తేనున్నట్టు ట్రంప్ సర్కారు ప్రకటించింది. ఈ మేరకు వెయ్యి డాలర్లు(సుమారు రూ.86,000)లు రుసుముగా నిర్ణయించింది. దీంతో వీసాల లాంగ్ క్యూను తగ్గించుకునే వెసులుబాటు కల్పించనుంది. నిర్ణీత ఫీజు చెల్లించడం ద్వారా వీసా దరఖాస్తుదారులు ఇంటర్వ్యూను తక్కువ కాల వ్యవధిలో మిగతా దరఖాస్తుదారులతో పోలిస్తే ముందుగా పూర్తి చేసుకునే వీలు కలుగనుంది.

## 50 వేల మంది నకిలీ ఉద్యోగులకు జీతం 230 కోట్లు

### బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో భారీ శాలరీ స్కామ్

భోపాల్, జూన్ 6: బీజేపీ నేతృత్వంలోని మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో భారీ స్థాయిలో జీతాల కుంభకోణానికి స్కెచ్ వేశారా? లేని ఉద్యోగులను ఉన్నట్లుగా సృష్టించి వారి పేరున జీతాలు స్వాహా చేయడానికి కుట్ర జరిగిందా? ఈ ప్రశ్నలకు ఔననే సమాధానం వినిపిస్తున్నది. మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన 50,000 మంది ఉద్యోగులకు గత ఆరు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించడం లేదు. మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో పని చేస్తున్న మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 9 శాతం ఉండే ఈ 50 వేల మంది ప్రభుత్వ ఉద్యోగుల ఉనికిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ మధ్యప్రదేశ్ చరిత్రలోనే ఇది అతి పెద్ద జీతాల కుంభకోణంగా బయటపడే అవకాశం కనపడుతున్నది. అధికారిక దస్త్రాలలో కనిపిస్తున్న ఈ ఉద్యోగులకు సంబంధించిన పత్రాలను ఎన్‌డీటీవీ సేకరించింది. ప్రతి ఉద్యోగి పేరు, ఎంప్లాయీ కోడ్ ఆ దస్త్రాలలో ఉంది. అయితే గడచిన ఆరు నెలలుగా వారికి జీతాలను చెల్లించే ప్రక్రియ మాత్రం జరగలేదు. రూ. 230 కోట్ల అవినీతి జరగడానికి ఆస్కారం ఉన్న ఈ కుంభకోణంపై ఈ ఖాతాలకు జీతాలు ఇప్పటి వరకు వెళ్లలేదని తాను కచ్చితంగా చెప్పగలనని, దీనిపై తాము వెంటనే చర్యలు తీసుకున్నామని కమిషనర్ ఆఫ్ ట్రెజరీ అకౌంట్స్ భాస్కర్ లక్ష్కర్ ఎన్‌డీటీవీకి తెలిపారు.

# ట్రంప్‌ను అభిశంసించండి!

- ఆ స్థానంలో జేడీ వాన్స్‌ను నియమించండి
- మస్క్ డిమాండ్.. ట్రంప్‌తో ముదిరిన వైరం
- ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ట్రంప్ పేరుందని ఆరోపణ
- తాను లేకపోతే ఆయన ఓడిపోయేవాడని వ్యాఖ్య
- మస్క్‌కు మతి తప్పిందన్న అమెరికా అధ్యక్షుడు



వాషింగ్టన్, జూలై 6: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, స్పేస్ ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య వివాదం రోజురోజుకు ముదురుతున్నది. నిన్నమొన్నటి వరకు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఈ ఇద్దరూ ఇప్పుడు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం బిగ్ బ్యూటీఫుల్ బిల్లుపై ట్రంప్‌ను ఉద్దేశించి మస్క్ నేరుగానే విమర్శలు గుప్పించారు. ట్రంప్‌ను అభిశంసించి, ఆ స్థానంలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను అధ్యక్షుడిగా చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా సెక్స్ కుంభకోణంలో నిందితుడైన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌నకు సంబంధాలున్నాయని, ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ట్రంప్ పేరుందని, అందుకే దానిని ఆయన బయటపెట్టడం లేదంటూ సంచలన ఆరోపణలు చేశారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్ వ్యవహారంలో మస్క్ తీరుతో తాను విసిగిపోయానంటూ ట్రంప్ పేర్కొన్న కొద్ది సేపటికే మస్క్ ఈ తీవ్ర ఆరోపణ చేయడం గమనార్హం. కాగా ట్రంప్ విధించిన టారిఫ్‌ల కారణంగా ఈ ఏడాది రెండో భాగంలో దేశం మాంద్యంలోకి జారుకుంటుందని మస్క్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

**ఎలాన్ కాంట్రాక్టులను రద్దు చేయాలి**

'మా బడ్జెట్‌లో నిధులను, బిలియన్ల కొద్దీ డాలర్లను ఆదా చేయాలంటే సులభమైన మార్గం ఎలాన్ మస్క్‌కు ఇచ్చిన ప్రభుత్వ సబ్సిడీలను, కాంట్రాక్టులను రద్దు చేయడమే' అంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనతో టెస్లా షేర్లు 14.3 శాతం నష్టపోయి, 150 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది. ఒకే రోజు ఇంత గరిష్ట స్థాయిలో నష్టపోవడం టెస్లా చరిత్రలో ఇదే ప్రథమం. ఇది జరిగిన కొద్ది సేపటికి ట్రంప్‌ను అధ్యక్ష పదవి నుంచి అభిశంసించాలంటూ మస్క్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'చూడండి.. ఎలాన్, నేను గొప్ప సంబంధాన్ని కలిగి ఉన్నాము. ఇక ముందు ఇలాగే ఉంటామో లేదో తెలియదు' అని ట్రంప్ అంటుండగానే దానికి మస్క్ తీవ్రంగా లైవ్‌లోనే స్పందించారు. 'నేను లేకుంటే ట్రంప్ ఎన్నికల్లో ఓడిపోయేవాడు. ట్రంప్, ఇతర రిపబ్లికన్లకు దాదాపు 300 బిలియన్ డాలర్లు ఖర్చు చేశాం. ఇదా కృతజ్ఞతా?' అని మస్క్ ప్రశ్నించారు. అలా అయితే డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్‌ను తొలగిస్తా స్పేస్ ఎక్స్, టెస్లా సహా మస్క్ కంపెనీలకున్న ఫెడరల్ కాంట్రాక్టులన్నీ రద్దు చేస్తానని ట్రంప్ చేసిన హెచ్చరికపై మస్క్ సైతం దీటుగానే స్పందిస్తూ నాసాకు కీలకమైన డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్‌ను స్పేస్ ఎక్స్ తొలగించడం ప్రారంభిస్తుందని హెచ్చరించారు. సైన్స్ మిషన్‌లను ప్రారంభించడం, ఈ దశాబ్దం తర్వాత వ్యోమగాములను చంద్రుని ఉపరితలం వైపు తిరిగి పంపడం వంటి కీలక ప్రాజెక్టుల కోసం నాసా కూడా ఎక్కువగా స్పేస్ ఎక్స్‌పైనే ఆధారపడుతున్నది. ఈ క్రమంలో మస్క్ హెచ్చరిక ప్రాధాన్యతను సంతరించుకుంది.

**కుదరని రాజీ!**

ట్రంప్, మస్క్ మధ్య వివాదం ముదిరిన నేపథ్యంలో అమెరికన్ ఫండ్ మేనేజర్ బిల్ ఆక్‌మన్ రాజీ కుదిర్చే ప్రయత్నం చేశారు. దేశ ప్రయోజనం కోసం ఇద్దరూ చేతులు కలపాలని ఎక్స్‌లో కోరారు. ఇందుకు మస్క్ సానుకూలంగా స్పందించారు. అయితే మస్క్‌తో మాట్లాడేందుకు ట్రంప్ సుముఖంగా లేనట్టు సమాచారం. ఏబీసీ న్యూస్‌కు ఇచ్చిన ఫోన్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. మస్క్ మతిస్థిమితం కోల్పోయాడని, ఆయనతో మాట్లాడేందుకు తాను సిద్ధంగా లేనని స్పష్టం చేశారు. కొత్త బిల్లులో ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) క్రెడిట్‌లు లేనందున మస్క్ నిరాశ చెందారని పేర్కొన్నారు.

## జైట్లీకి చెప్పే లండన్‌కు పారిపోయా

- విజయ్ మాల్యా సంచలన వ్యాఖ్యలు
- పాక్‌కు ముందే సమాచారమిచ్చి విదేశాంగ మంత్రి దాడి చేస్తారు
- ఆర్థిక మంత్రికి ముందే చెప్పి ఆర్థిక నేరగాళ్లు విదేశాలకు పారిపోతారు
- మోదీకి చెందిన మొత్తం వ్యవస్థ లొంగిపోయినట్టు ఉంది: విపక్షం



న్యూఢిల్లీ: బీజేపీతో లోపాయికారి ఒప్పందంతో ఎంతోమంది ఆర్థిక నేరగాళ్లు దేశం విడిచి పారిపోయారన్న విమర్శలున్నాయి. బ్యాంకులకు వేలకోట్లు ఎగవేసి బ్రిటన్‌కు పారిపోయిన ఆర్థిక నేరగాడు విజయ్ మాల్యా తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. భారత్ నుంచి 2016లో తాను పారిపోవడానికి ముందు అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి, బీజేపీ నేత అరుణ్ జైట్లీకి సమాచారం ఇచ్చానని విజయ్ మాల్యా తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయన దేశం నుంచి పారిపోవడం, అందుకు దారితీసిన పరిస్థితులు మరోసారి చర్చను లేవనెత్తాయి. 'విమానాశ్రయానికి బయల్దేరే ముందు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి తెలియచేసి ఆ తర్వాత ఢిల్లీ నుంచి లండన్‌కు విమానం ఎక్కాను. ఈ వార్త బయటకు పొక్కడంతో మీడియా, రాజకీయ వర్గాలలో పెద్ద దుమారమే రేగింది. చట్టపరమైన ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో దేశం విడిచి నేను ఎలా వెళ్లగలిగానని ప్రశ్నలు మొదలయ్యాయి' అని పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ విజయ్ మాల్యా తెలిపారు. 'మేం ఇద్దరం కలసి ఉండగా చూశానని ఓ కాంగ్రెస్ ఎంపీ ప్రకటించారు. దీంతో జైట్లీ మాట మార్చారు. తాను మాల్యాను కలిసిన మాట వాస్తవమేనని, అయితే వాకింగ్ చేస్తుండగా కలిశానని ఆయన చెప్పారు' అంటూ మాల్యా గుర్తు చేసుకున్నారు. 'ఓ సమావేశం కోసం జెనీవాకు వెళ్లేందుకు తాను లండన్ బయల్దేరుతున్నట్లు ఆర్థిక మంత్రికి తెలియచేశానని మాత్రమే నేను చెప్పాను. నేను తిరిగి వస్తాను. కూర్చుని సమస్యను పరిష్కరించుకుందామని బ్యాంకులకు దయచేసి నచ్చచెప్పండి అని కోరాను. ఈ నాలుగు ముక్కలు చెప్పడానికి ఎంత సమయం పడుతుంది' అని మాల్యా ప్రశ్నించారు.

**లొంగిపోయిన మోదీ వ్యవస్థ: కాంగ్రెస్**

విజయ్ మాల్యా తాజా ప్రకటనపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా తీవ్రంగా స్పందించారు. ప్రధాని మోదీ, కేంద్రంపై ఎక్స్ వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'పాక్‌కు ముందుగానే సమాచారం అందచేసి విదేశాంగ మంత్రి సైనిక దాడి చేస్తారు. ఆర్థిక మంత్రికి ముందుగానే చెప్పి ఆర్థిక నేరస్థులు దేశం విడిచి పరారవుతారు. నరేంద్ర మోదీకి చెందిన యావత్ వ్యవస్థ లొంగిపోయినట్లుగా ఉంది' అంటూ ఖేరా ఎద్దేవా చేశారు.

## ఆగస్టు 3న నీట్ పీజీ

### వాయిదాకు సుప్రీంకోర్టు అంగీకారం

న్యూఢిల్లీ: నీట్ పీజీ-2025 నిర్వహణను ఆగస్టు 3కు వాయిదా వేయాలన్న జాతీయ పరీక్షల బోర్డ్(ఎన్‌బీఈ) విజ్ఞప్తికి సుప్రీంకోర్టు శుక్రవారం అంగీకారం తెలిపింది. సాంకేతిక పరిమితుల ఆధారంగా ఎన్‌బీఈ విజ్ఞప్తిని అంగీకరించినట్టు కోర్టు పేర్కొన్నది. పరీక్ష నిర్వహణకు ఆగస్టు 3 కంటే ఎక్కువ పొడిగింపును మంజూరు చేయలేమని స్పష్టం చేసింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించాలని, రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించడం వల్ల వివిధ స్థాయిల్లో ఇబ్బందులు కలగవచ్చని పిటిషనర్ యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ చేసిన వాదనతో సుప్రీంకోర్ట్ అంగీకరించి ఒకే షిఫ్ట్‌లో నీట్ పీజీ నిర్వహించాలని ఎన్‌బీఈని ఆదేశించింది. అయితే ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహణకు పరీక్ష కేంద్రాల సంఖ్యను పెంచాలని, భద్రతా చర్యలు చేపట్టాలని.. ఇందుకోసం పరీక్ష నిర్వహణ గడువును పెంచాలని ఎన్‌బీఈ కోర్టును కోరింది.

## ఎలాన్ మస్క్ కొత్త పార్టీ?

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో విభేదాల వేళ బిలియనీర్ ఎలాన్ మస్క్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మధ్య వయస్కుల్లో 80 శాతం మందికి ప్రాతినిధ్యం వహించే తాను కొత్త రాజకీయ పార్టీ ప్రారంభించడానికి ఇది సరైన సమయమేనా అని ఆయన ఎక్స్‌లో తనకున్న 20 కోట్ల మందికి పైగా ఫాలోవర్లను ప్రశ్నించారు. అందులో 400,000 మంది తన ప్రశ్నకు స్పందించారని.. అందులో 83 శాతం మంది మూడో, మధ్య స్థాయి పార్టీకి అనుకూలంగా స్పందించారని మస్క్ తెలిపారు.

## అమర్‌నాథ్ యాత్ర 38 రోజులే..

న్యూఢిల్లీ: అమర్‌నాథ్ యాత్రను ఈ ఏడాది జూలై 3 నుంచి ఆగస్టు 9 వరకు కేవలం 38 రోజులు మాత్రమే నిర్వహించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో 26 మంది యాత్రికులు మృతిచెందగా, ప్రభుత్వం రక్షణ కారణాలు చూపుతూ ఈ నిర్ణయం తీసుకుంది. అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో 50 వేల మంది సీఆర్పీఎఫ్ జవాన్లు, జమ్ము కశ్మీర్ పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నారు. బలగాల వాహనాల రాకపోకల కోసం ఆయా మార్గాల్లో ప్రత్యేకంగా జామర్లను ఏర్పాటు చేశారు. యాత్రికులు ప్రయాణించే మార్గంలో పూర్తి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## 30 ఏండ్ల కనిష్ఠానికి హజ్ యాత్రికులు

న్యూఢిల్లీ: ఈ ఏడాది హజ్ యాత్రికుల సంఖ్య రికార్డు స్థాయిలో తగ్గిపోయింది. కొవిడ్ మహమ్మారి సమయం మినహాయించి, 30 ఏళ్ల కనిష్ఠానికి తగ్గింది. సౌదీ అరేబియా హజ్ శాఖ ఎక్స్ పోస్ట్‌లో తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఏడాది 16,73,230 మంది ముస్లింలు హజ్ యాత్రకు వెళ్లారు. నిరుడు కన్నా 1.6 లక్షల మంది తగ్గిపోయారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం వల్ల కొందరు ముస్లింలు హజ్ యాత్రకు దూరంగా ఉన్నారని విశ్లేషకులు చెప్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, కఠిన నిబంధనలు కూడా యాత్రికులను వెనుకంజ వేసేలా చేసి ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు.




**దేశంలో మొత్తం యాక్టివ్ కరోనా కేసులు 5,364**

**కొత్తగా నమోదైన కేసులు 498**

**ఈ ఏడాది ఇప్పటివరకు మరణాలు-55**

**తాజాగా నమోదైన మరణాలు-4**

## మహమ్మారికి ఒక్క మ్యుటేషన్ దూరంలో!

### చైనాలో కొవిడ్-19 లాంటి మరో వైరస్ గుర్తింపు

న్యూఢిల్లీ: ప్రపంచాన్ని వణికించిన కొవిడ్-19 లాంటి మరో ప్రాణాంతక వైరస్ మానవాళిపై విరుచుకు పడేందుకు సిద్ధంగా ఉన్నదని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ప్రమాదకర గబ్బిలాల వైరస్‌ను కూడా ఇటీవలే చైనాలోనే కనుగొన్నారు. ఇది మహమ్మారిగా విరుచుకుపడటానికి ఒకే ఒక్క మ్యుటేషన్ దూరంలో ఉన్నదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ వైరస్‌ను 'హెచ్‌కేయూ5-సీవోవీ-2'గా పిలుస్తున్నారు. మెర్బెకో వైరస్‌లు అని పిలిచే పెద్ద వ్యాధికారక సమూహంలో ఇది భాగమని గుర్తించారు. ఇందులో ప్రమాదకరమైన 'మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ కరోనా వైరస్' (ఎంఈఆర్‌ఎస్-సీవోవీ) కూడా ఉన్నది. అరేబియా ద్వీపకల్పంలో నివసించే వారు లేదంటే అక్కడికి వెళ్లిన వారు దీని బారినపడుతున్నారు. తాజాగా కనుగొన్న కొత్త వైరస్ కూడా ఎంఈఆర్‌ఎస్‌ను పోలి ఉండటంతో శాస్త్రవేత్తలు హెచ్చరికలు జారీచేస్తున్నారు. ఈ అధ్యయన వివరాలు నేచర్ కమ్యూనికేషన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## ప్రపంచం చీదరించుకునే దేశాల్లో చైనా టాప్

- అమెరికాకు రెండో ర్యాంక్
- పదో స్థానంలో భారత్

న్యూఢిల్లీ: ప్రపంచమంతా ఓ కుగ్రామంగా మారుతున్నప్పటికీ, వివిధ దేశాల పట్ల ప్రజలకు ద్వేషం, అపనమ్మకం కూడా పెరుగుతున్నాయి. 'న్యూస్‌వీక్' విడుదల చేసిన వరల్డ్ పాపులేషన్ రివ్యూ నివేదిక ప్రకారం, ప్రపంచ ప్రజలు చీదరించుకుంటున్న, ద్వేషిస్తున్న దేశాల జాబితాలో మొదటి స్థానంలో చైనా ఉంది. రెండో స్థానంలో అమెరికా, మూడో స్థానంలో రష్యా ఉన్నాయి. భారత్ పదో స్థానంలో ఉంది. చైనాను ప్రపంచ ప్రజలు అసహ్యించుకోవడానికి కారణాలు ఏమిటంటే, ఆ దేశంలో నియంతృత్వ పాలన, సెన్సార్‌షిప్, పర్యావరణానికి నష్టం కలిగించడం, వీగర్ ముస్లింల పట్ల వ్యవహరిస్తున్న తీరు. అమెరికా 'సూపర్‌పవర్' మెంటాలిటీ, ఆయుధాల పట్ల మోజు, జోక్యం చేసుకునే వైఖరి వంటివి ఆ దేశాన్ని ద్వేషించేలా చేస్తున్నాయి. రష్యాపై ద్వేషానికి కారణాలు.. ఉక్రెయిన్‌పై యుద్ధం, ప్రజాస్వామిక హక్కులపై ఉక్కుపాదం మోపడం.

## పోలీసులను బలి పశువుల్ని చేస్తారా?

- బెంగళూరు తొక్కిసలాట ఘటనలో సిద్ధరామయ్య సర్కారు తీరుపై మాజీ ఐపీఎస్‌లు, నెటిజన్ల ఆగ్రహం
- ఆర్సీబీ మార్కెటింగ్ విభాగ అధిపతి నిఖిల్ సోసలె అరెస్ట్
- ఇంటెలిజెన్స్ చీఫ్ బదిలీ, సీఎం రాజకీయ కార్యదర్శిపై వేటు



దయానంద్

బెంగళూరు: ఆర్సీబీ విజయోత్సవ వేడుక సందర్భంగా గత బుధవారం బెంగళూరులో జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి నగర పోలీస్ కమిషనర్ దయానంద్ సహ అయిదుగురు అధికారులను సర్కారు బదిలీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిద్ధరామయ్య ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలకు పోలీసులను బలి పశువులను చేస్తారా అని పలువురు విశ్రాంత పోలీస్ అధికారులు, నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటన జరగడానికి కారణం పెద్ద వ్యక్తులు. తప్పులు జరగొచ్చు. కానీ దానికి సస్పెండ్ల రూపంలో ప్రతిస్పందన ఉండకూడదని నగర మాజీ పోలీస్ కమిషనర్ మేఘరిక్ వ్యాఖ్యానించారు. 'ఈ మరణాలకు నియంత్రణ లేని డిప్యూటీ సీఎం శివకుమారే కారణమని..' విశ్రాంత ఐపీఎస్ అధికారి భాస్కర్ రావు తీవ్రంగా విమర్శించారు. తొక్కిసలాటకు కారణమైన శివకుమార్, సిద్ధరామయ్య పోలీసులను ముందుకు నెట్టి తప్పించుకుంటున్నారని.. వారిద్దరూ తమ పదవులకు రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి.

**ఆర్సీబీ అధికారులపై చర్యలొద్దు..**

తొక్కిసలాట ఘటన నేపథ్యంలో రాష్ట్ర అదనపు డీజీపీ(ఇంటెలిజెన్స్) హేమంత్ నింబాళ్కర్‌ను ప్రభుత్వం శుక్రవారం బదిలీ చేసింది. అలాగే ఎమ్మెల్సీ గోవిందరాజ్‌ను సీఎం సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శి పదవి నుంచి వెంటనే తొలగిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేసింది. తొక్కిసలాట ఘటనకు సంబంధించి నలుగురు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అధికారులను, డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఉద్యోగులు ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో ఆర్సీబీ మార్కెటింగ్, రెవెన్యూ విభాగాధిపతి నిఖిల్ సోసలె ఉన్నారు. మరోవైపు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శులపై చర్యలొద్దంటూ కర్ణాటక హైకోర్టుఉత్తర్వులు జారీ చేసింది.

## జీ7 సదస్సుకు మోదీకి ఆహ్వానం

న్యూఢిల్లీ, జూన్ 6: కెనడాలోని కననాస్కీస్‌లో జరిగే జీ7 సదస్సుకు ప్రధాని మోదీకి ఎట్టకేలకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ప్రధాని మోదీకి కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఫోన్ చేసి ఆహ్వానించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ ఎక్స్‌లో వెల్లడించారు. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన కార్నీకి శుభాకాంక్షలు తెలియచేశానని, ఈ నెలాఖరులో జరిగే జీ7 సదస్సుకు ఆహ్వానించినందుకు ధన్యవాదాలు తెలియచేశానని మోదీ తెలిపారు.

### భారత్ జెట్స్‌ను కూల్చేశాం.. సాక్ష్యాలున్నాయ్: పాక్

ఇస్లామాబాద్: భారత్‌కు చెందిన మూడు రఫేల్, ఒక ఎస్‌యూ-30, ఒక మిరాజ్ 2000, ఒక మిగ్-29 యుద్ధ విమానాన్ని, ఒక డ్రోన్‌ను తమ సైన్యం కూల్చేసిందని, ఇందుకు సాక్ష్యాలు ఉన్నాయని పాక్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్ జనరల్ షంషద్ మీర్జా బీబీసీ ఇంటర్వ్యూలో చెప్పారు.



## చినాబ్ వంతెన జాతికి అంకితం

### ప్రారంభించిన ప్రధాని మోదీ.. ప్రపంచంలోనే ఎత్తయిన బ్రిడ్జి ఇది

*శ్రీనగర్, జూన్ 6: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చినాబ్ రైల్వే వంతెన జమ్ముకశ్మీర్‌లో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం దీనిని జాతికి అంకితం చేశారు. ఇంజనీరింగ్ అద్భుతమైన ఈ రైలు వంతెనను ఉదంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ లింక్ (యూఎస్‌బీఆర్‌ఎల్) ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. కశ్మీర్ లోయను మిగతా భారతదేశంతో ఈ బ్రిడ్జి కలుపుతుంది. కట్రా నుంచి శ్రీనగర్ వరకు నడిచే వందేభారత్ రైలుకు ప్రధాని జెండా ఊపడం ద్వారా దీనిని ప్రారంభించారు. ఈఫిల్ టవర్ కన్నా ఎత్తయిన ఈ వంతెన చినాబ్ నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఈ ఆర్చి స్టీల్ బ్రిడ్జి పొడవు 1351 మీటర్లు. ఈ సందర్భంగా ప్రధాని అంజీ నదిపై నిర్మించిన తొలి రైల్వే కేబుల్ వంతెన అంజీ కేబుల్ బ్రిడ్జిని, 46 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులను, మరో వందేభారత్ రైలు సర్వీసును ప్రారంభించారు. చినాబ్ వంతెన నిర్మాణాన్ని చేపట్టిన ఇంజినీర్ల బృందంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గాలి మాధవీలత సభ్యురాలిగా ఉన్నారు. గత 17 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికే ఆమె అంకితమయ్యారు.*



# నీటిని, కరెంటును మింగేస్తున్న ఏఐ!

**డాటా సెంటర్లకు కరెంట్.. సర్వర్ల కూలింగ్‌కు నీళ్లు ▪ పర్యావరణహిత ఏఐ తేవాలంటున్న శాస్త్రవేత్తలు**

*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

*హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): చదువుల నుంచి వైద్యం వరకు, వ్యాపారం నుంచి వ్యవసాయం వరకూ ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ-ఏఐ) ప్రమేయం లేని రంగం లేదంటే అతిశయోక్తి కాదు. మానవ ప్రమేయాన్ని తగ్గించి క్లిష్టమైన పనులను సులువుగా, వేగంగా నిర్వర్తించే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమే ఏఐ. అయితే, ఏఐ కారణంగా పర్యావరణానికి ఒక విధంగా పెద్దయెత్తున నష్టం కూడా వాటిల్లుతున్నట్టు వాతావరణ నిపుణులు అంటున్నారు. సకల జీవరాశికి అవసరమైన నీటిని, విద్యుత్తును ఏఐ సాంకేతికత అమాంతం మింగేస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.*

***విద్యుత్తు వాడకం ఇలా..***

*ఏదైనా సమాచారం కోసం గూగుల్‌లో సెర్చ్ చేస్తాం. మనం కీబోర్డ్‌తో టైప్ చేయగానే సదరు ఐటెమ్‌కు సంబంధించిన లక్షలాది లింకులు ప్రత్యక్షమవుతాయి. బ్యాగ్రౌండ్‌లో ఈ వర్క్‌ను ఏఐ నిర్వహిస్తుంది. చాట్‌జీపీటీ, గ్రోక్, డీప్‌సీక్ వంటి చాట్‌బాట్‌లో అడిగే ప్రశ్నలకు సమాధానాలు కూడా ఇలాగే వస్తాయి. అయితే, ఒక్క సమాధానం రావడానికి డాటా సెంటర్లలోని పలు సర్వర్లు అనుసంధానమై సమాచారాన్ని షేర్ చేసుకోవాల్సి ఉంటుంది. దీనికోసం పెద్దయెత్తున కరెంట్ వినియోగం చాల్సి వస్తున్నది. 2024లో ఏఐ ఆధారిత డాటా సెంటర్లు 460 టెరావాట్-అవర్ విద్యుత్తును వాడుకొన్నట్టు నివేదికలు చెప్తున్నాయి. ఇది స్వీడన్‌లో ఏడాదిపాటు వినియోగించే విద్యుత్తుకు సమానం. ఏఐల వాడకం పెరుగుతుండటంతో 2026నాటికి డాటా సెంటర్లు నడవడానికి 1000 టెరావాట్-అవర్‌ల విద్యుత్తు అవసరపడొచ్చని అంచనా.*

***నీటి వాడకం ఇలా..***

*ఏఐ రిజల్ట్స్ కోసం నిరంతరాయంగా సర్వర్లు పనిచేయడంతో అవి విపరీతంగా వేడెక్కిపోతాయి. దీంతో వాటిని చల్లబరిచేందుకు పెద్దయెత్తున నీళ్లు అవసరపడుతున్నాయి. 2024లో గూగుల్ కంపెనీ తమ డాటా సెంటర్లలోని సర్వర్లను చల్లబరిచేందుకు 22,700 కోట్ల లీటర్ల నీటిని వాడింది. అంటే తుర్కియేలో 33 శాతం మంది జనాభాకు ఏడాదిపాటు సరిపోయే నీటికి ఇది సమానం. రోజురోజుకూ ఏఐ వాడకం పెరిగిపోవడంతో, అదే స్థాయిలో కరెంట్, నీటి వినియోగం కూడా పెరిగిపోతున్నది. దీంతో ఏఐ కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదమున్నదని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణహిత ఏఐ సాంకేతికతను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని పలువురు శాస్త్రవేత్తలు నొక్కి చెప్తున్నారు.*

**గూగుల్ సెర్చింగ్‌లో ఒక్క ప్రశ్నకు**

- అవసరమయ్యే కరెంట్ – 20 సెకండ్ల బల్బ్ విద్యుత్తు
- అవసరమయ్యే నీరు – 50 మిల్లీలీటర్లు నీరు

- ఏఐ కారణంగా పరిశ్రమల నీటి వినియోగంలో ఏడాదిలో పెరుగుదల – 20 శాతం
- ఒక్కో డాటా సెంటర్ వినియోగించే నీరు- ఓ చిన్నపట్టణానికి సరిపడే నీరు
- ఒక్కో డాటా సెంటర్ వినియోగించే విద్యుత్తు- 80 వేల ఇండ్లకు సరిపడా విద్యుత్తు

